క్లుప్తంగా

పారదర్శకంగా కులగణన సర్వే
సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్



చాట్రాయి: కులగణన సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అన్నారు. చనుబండ గ్రామంలో నిర్వహిస్తున్న కులగణన సర్వేను బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. యాప్‌లో పొందుపరిచిన అన్ని వివరాలను సక్రమంగా నమోదు చేయాలన్నారు. అనంతరం 3వ పోలింగ్ బూత్‌ను పరిశీలించారు. తహసీల్దార్ వై.రంగారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ ఆత్మీయ సమావేశం

తిరువూరు: వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు జరుగుతుందని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు చలమాల సత్యనారాయణ తెలిపారు. విజయవాడ ఎంపీ కేశినేని నాని, నియోజకవర్గ ఇన్‌చార్జి స్వామిదాసు పాల్గొంటారన్నారు.

రోగులకు వైద్య పరీక్షలు

ఇబ్రహీంపట్నం: ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కొండపల్లి మున్సిపాలిటీ సచివాలయాల కో–ఆర్డినేటర్ లంకే అంకమోహనరావు అన్నారు. ఇబ్రహీంపట్నం రెండో సచివాలయం పరిధిలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం బుధవారం జరిగింది. వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు విజయకుమార్ పర్యవేక్షణలో పలువురు వైద్యులు, ఆరోగ్య సిబ్బంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. వైద్య ఆరోగ్య సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రయాణికుల మన్ననలు పొందాలి

ఇబ్రహీంపట్నం: ఆర్టీసీ డిపోలో డ్రైవర్స్ డే వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా డెప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ జాన్ సుధాకర్ ముఖ్యఅతిథిగా హాజరైయ్యారు. ఆర్టీసీ డ్రైవర్లతో పాటు ప్రైవేట్ డ్రైవర్లకు గులాబీ పూలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు విధి నిర్వహణలో ప్రయాణికుల మన్ననలు పొందాలని సూచించారు. డ్రైవింగ్ సమయంలో తమపై ఓకుటుంబం ఆధారపడి ఉందనే విషయం గుర్తుపెట్టుకోవాలన్నారు. డిపో మేనేజర్ ఎ.సుబ్రహ్మణ్యం, ట్రాఫిక్ ఇన్‌చార్జ్ ఎస్.శ్రీదేవి, డెప్యూటీ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, అనంతరాములు, సిబ్బంది పాల్గొన్నారు.

తేనె మంచు తెగులు నివారణకు చర్యలు తీసుకోవాలి

చాట్రాయి: మామిడి పూతలో తేనె మంచు నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని ఉద్యానవన శాఖాధికారి హేమ అన్నారు. బుధవారం కొత్తగూడెం, ఆరుగొలనుపేట గ్రామాల్లో మామిడి తోటలను ఆమె పరిశీలించి మాట్లాడారు. ప్రస్తుతం మామిడి పూత మొగ్గ, పచ్చపూత, తెల్లపూత దశల్లో ఉందన్నారు. పూర్తిగా పూత వచ్చిన తోటల్లో తేనె మంచు పురుగు ఉధృతి ఉంటే 0.5 ఇమిడా క్లోప్రిడ్‌ను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని, పూత మాడు దశలో ఉంటే 2 గ్రాముల సాఫ్‌ను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు.

నేడు దేవస్థానం దుకాణాలకు వేలం

ఆగిరిపల్లి: స్థానిక శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయ ప్రాంగణంలోని దుకాణాలకు గురువారం దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో వేలం నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి భవాని తెలిపారు. స్థానిక పెద్ద కొట్టాయం సమీపంలో నూతనంగా నిర్మించిన రెండు దుకాణాలు, రథశాల పక్కన ఉన్న మూడో దుకాణానికి వేలం పాట నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల వారు రూ.20 వేలు ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని ఆమె కోరారు.

గ్యాస్ వినియోగంపై అవగాహన

ఆగిరిపల్లి: గోపాలపురంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా నూజివీడు అగ్నిమాపక సిబ్బంది, భాగ్యలక్ష్మి ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు పాలడుగు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. ప్రమాదం జరిగినప్పుడు మంటలను ఎలా అదుపు చేయాలో వినియోగదారుల ముందు ప్రదర్శనలు చేసి చూపించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శేఖర్, సర్పంచ్ సత్యవాణి, బీజేపీ మండల అధ్యక్షుడు కొవ్వలి బాబురావు, కృష్ణా జిల్లా ఎల్పీజీ అసిస్టెంట్ మేనేజర్ విజయ్‌కుమార్, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

పోలవరం కాలువలో మృతదేహం గుర్తింపు

గన్నవరం: మండలంలోని సూరంపల్లి శివారులో పోలవరం కాలువలో ఓ వ్యక్తి మృతదేహాన్ని బుధవారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ నాగరాజు నేతృత్వంలో సిబ్బంది అక్కడికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడు ఆగిరిపల్లి మండలం అడవినెక్కలంకు చెందిన బొడ్డు శ్యామ్ (50)గా గుర్తించారు. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అందుబాటులో ఆధునిక వైద్యం

- కిడ్నీ రోగులకు డయాలసిస్ యూనిట్ ఏర్పాటు
- అత్యవసర వైద్యసేవలకు ఆక్సిజన్ సదుపాయం
- 30 గ్రామాల రోగులకు సేవలందిస్తున్న తిరువూరు ప్రభుత్వాస్పత్రి



ప్రభుత్వాస్పత్రిలో నూతన భవనాలు



డయాలసిస్ యూనిట్



తిరువూరు ప్రభుత్వాసుపత్రిలో ఆక్సిజన్ ప్లాంట్

తిరువూరు: గత ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన తిరువూరు ప్రభుత్వాస్పత్రిలో ఆధునిక వైద్యసేవల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల రోగులకు అందుబాటులో ఉన్న తిరువూరు ప్రభుత్వాస్పత్రిలో వైద్యుల పోస్టులు భర్తీ చేయడంతో పాటు అవసరమైన భవనాల నిర్మాణాన్ని కూడా చేపట్టింది. గత రెండేళ్లలో రూ. 6 కోట్ల వ్యయంతో భవనాల నిర్మాణం పూర్తి చేయగా, రోగులకు అవసరమైన వైద్య సదుపాయాలను కూడా సమకూరుస్తోంది. చాలీచాలని వార్డులు, అత్యవసర వైద్యం అందని పరిస్థితుల నుంచి 24 గంటలూ రోగులకు నాణ్యమైన వైద్యం అందించే దిశగా ఆస్పత్రిని అభివృద్ధి చేస్తున్నారు.

డయాలసిస్ యూనిట్ ఏర్పాటు

కిడ్నీ రోగులు అధికంగా ఉన్న తిరువూరు నియోజకవర్గంలో దీర్ఘకాలంగా ప్రతిపాదనలకు పరిమితమైన డయాలసిస్ యూనిట్‌ను తిరువూరు ప్రభుత్వాస్పత్రిలో గత ఏడాది ప్రారంభించారు. గిరిజన సంక్షేమ శాఖ రూ.1.30 కోట్ల నిధులతో ఏర్పాటు చేసిన డయాలసిస్ యూనిట్‌లో ఏకొండూరు, గంపలగూడెం, విస్సన్నపేట మండలాలతో పాటు, ఖమ్మం జిల్లాలోని పలు గ్రామాల రోగులకు సేవలందుతున్నాయి. కోవిడ్ రోగులకు, ప్రసూతి వైద్య సేవలకు, చిన్నపిల్లలకు ప్రత్యేక వార్డులను ఏర్పాటు చేశారు. కార్పొరేట్, ప్రైవేట్ ఆస్పత్రులకు దీటుగా అత్యాధునిక పరికరాలతో వైద్యసేవలందిస్తున్నారు. పేద గర్భిణులు పైసా ఖర్చు లేకుండా ఈ ఆస్పత్రిలో ప్రసూతి సేవలు పొందుతుండటం గమనార్హం. ఔట్‌పేషెంట్ల సంఖ్య కూడా పెరుగుతోంది. రోజుకు 200 నుంచి 300 మంది అవుట్ పేషెంట్లు ఈ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు. రోగులకు అత్యవసర సమయాల్లో శ్వాస అందించేందుకు ఆక్సిజన్ ప్లాంట్, నిరంతర విద్యుత్ సరఫరాకు జనరేటర్ సౌకర్యం కూడా కల్పించారు. ఇటీవల ఈ ఆస్పత్రిలో రూ.5 కోట్లతో అదనపు భవనాలను నిర్మించారు. రోగులకు సహాయకులుగా వచ్చిన వారు సైతం బస చేసేందుకు విశ్రాంతి గదులను ఏర్పాటు చేశారు.

వసతుల కల్పనకు ప్రాధాన్యం



పేద రోగులకు సత్వర, నాణ్యమైన వైద్యసేవలందించేందుకు, అన్ని సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. ఎంతోకాలంగా నిర్లక్ష్యానికి గురైన ఈ ఆస్పత్రిని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తోంది. రోగులు ఈ ఆస్పత్రిలో వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలి.

– రేగళ్ల మోహన్‌రెడ్డి, తిరువూరు ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ వైస్‌చైర్మన్

30న సీఎం జగన్ బహిరంగ సభకు తరలిరండి
ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: ఏలూరులో ఈనెల 30న జరుగనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభకు నియోజకవర్గం నుంచి పెద్దఎత్తున వైఎస్సార్ సీపీ శ్రేణులు తరలి రావాలని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నూజివీడు పట్టణంతో పాటు నూజివీడు, ఆగిరిపల్లి, ముసునూరు, చాట్రాయి మండలాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, సానుభూతిపరులు, అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చి సీఎం పాల్గొనే బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

గాయపడిన వృద్ధుడు మృతి

నూజివీడు: రోడ్డు ప్రమాదంలో ఈనెల 21న తీవ్రంగా గాయపడిన వృద్ధుడు గుంటూరులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడని రూరల్ ఎస్‌ఐ తలారి రామకృష్ణ తెలిపారు. మండలంలోని వెంకటాద్రిపురం గ్రామానికి చెందిన కొలుసు నాగేంద్రరావు (62) కూలి పనికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా ఇంటికి సమీపంలోనే రోడ్డుపై ఒక యువకుడు అతివేగంగా బైక్‌తో ఢీకొట్టాడు. దీంతో నాగేంద్రరావుకు తీవ్ర గాయాలు కాగా, నూజివీడులోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం గుంటూరులోని ప్రభుత్వాస్పత్రికి మెరుగైన చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించేందుకే ఆడుదాం ఆంధ్రా
సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్



మైలవరంలో విజేతలకు బహుమతుల ప్రదానం



నూజివీడు డీఏఆర్ కళాశాలలో నూజివీడు–ముసునూరు జట్ల మధ్య వాలీబాల్ మ్యాచ్

నూజివీడు: గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ గల క్రీడాకారులను ప్రోత్సహించేందుకే ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అన్నారు. బుధవారం నూజివీడులోని డీఏఆర్ కళాశాల గ్రౌండ్‌లో ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలు ప్రారంభమయ్యాయి. వాలీబాల్ కోర్టును సబ్ కలెక్టర్, ఖోఖో కోర్టును ఎంపీపీ ఆరేపల్లి శిరీష, కబడ్డీ కోర్టును జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు పగడాల సత్యనారాయణ, కొమ్ము వెంకటేశ్వరరావు, డీఎల్‌డీఓ వెంకటరత్నం, డీవైఈఓ ఎం.సేవియా, ముసునూరు, చాట్రాయి ఎంపీడీఓలు జి.రాణి, దుర్గాప్రసాద్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, నాయకులు ఆరేపల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

మహిళల విభాగం ఖోఖో పోటీల్లో ముసునూరుపై నూజివీడు, ఆగిరిపల్లిపై చాట్రాయి, వాలీబాల్‌లో చాట్రాయిపై నూజివీడు, ఆగిరిపల్లిపై ముసునూరు జట్లు, షటిల్‌లో చాట్రాయిపై నూజివీడు, ఆగిరిపల్లిపై ముసునూరు జట్లు విజయం సాధించాయి. పురుషుల విభాగం కబడ్డీలో ముసునూరుపై నూజివీడు, చాట్రాయిపై ఆగిరిపల్లి, వాలీబాల్‌లో చాట్రాయిపై ఆగిరిపల్లి, ముసునూరుపై నూజివీడు, ఖోఖోలో చాట్రాయిపై ఆగిరిపల్లి, షటిల్‌లో ముసునూరుపై ఆగిరిపల్లి, నూజివీడుపై చాట్రాయి గెలుపొందాయి. ఈనెల 25న క్రికెట్ పోటీలు దిగవల్లిలోని గ్రౌండ్‌లో నిర్వహించనున్నారు. ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు ముసునూరు, నూజివీడు జట్ల మధ్య, ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆగిరిపల్లి, చాట్రాయి జట్ల మధ్య మ్యాచ్‌లు జరుగుతాయి. పోటీలను పీడీలు పి.రవీంద్ర, వాకా నాగరాజు, సరళ, స్వప్న, రాణి, నాగేశ్వరరావు, సతీష్, ప్రభాకర్ నిర్వహించారు.

క్రీడలతో స్నేహబంధం పెంపు..

మైలవరం: క్రీడా పోటీలతో క్రీడాకారుల మధ్య స్నేహబంధం పెరుగుతుందని ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి అన్నారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి స్టేడియంలో ఆడుదాం ఆంధ్రా మైలవరం నియోజకవర్గ స్థాయి పోటీలు జరుగుతున్నాయి. ఆడుదాం ఆంధ్రా మైలవరం మండల స్థాయి టోర్నమెంట్‌లో బుధవారం విజేతలకు బహుమతి ప్రదానం జరిగింది. క్రికెట్ మొదటి మ్యాచ్ జి.కొండూరు మండలం చెరువు మాధవరం టీమ్, విజయవాడ రూరల్ మండలం జక్కంపూడి టీమ్‌ల మధ్య జరిగింది. జక్కంపూడి టీమ్ గెలుపొందింది. పురుషుల షటిల్ బ్యాడ్మింటన్ విభాగంలో ప్రథమ స్థానం ఇబ్రహీంపట్నం మండలం, ద్వితీయ స్థానం జి.కొండూరు మండలం, తృతీయ స్థానం మైలవరం మండలం కైవశం చేసుకున్నాయి. పురుషుల ఖోఖో విభాగంలో ప్రథమ స్థానం మైలవరం మండలం, ద్వితీయ స్థానం ఇబ్రహీంపట్నం మండలం, తృతీయ స్థానం జి. కొండూరు మండలం, వాలీబాల్ విభాగంలో ప్రథమ స్థానం జి.కొండూరు మండలం, ద్వితీయ స్థానం ఇబ్రహీంపట్నం మండలం, తృతీయ స్థానం మైలవరం మండలం దక్కించుకున్నాయి. విజేతలకు ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి, ఎంపీపీ ఇస్లావత్ ప్రసన్నరాణిస్వామి బహుమతులు అందజేశారు.

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం



కేతనకొండ ఎంపీపీ పాఠశాలలో కేక్ కట్ చేస్తున్న బాలికలు, ఉపాధ్యాయులు



బాలికలకు ఆర్థిక సహాయం అందజేస్తున్న కళాశాల ప్రెసిడెంట్ శ్రీనివాసరెడ్డి

మైలవరం: విద్యార్థినులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఐసీసీ ప్రిసైడింగ్ ఆఫీసర్ డాక్టర్ పి. శోభారాణి అన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఐసీసీ, సహేలీ గరల్స్ క్లబ్, ఎన్ఎస్ఎస్ యూనిట్ సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. సహేలీ గరల్స్ క్లబ్ మెంటర్ డాక్టర్ కె.రాణీరుద్రమ మాట్లాడుతూ బాలికలు, మహిళల హక్కుల రక్షణ, పోషకాహార లోపం కలిగే ఇబ్బందులు, లింగ ఆధారిత హింస నుంచి రక్షణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు, కళాశాల ప్రెసిడెంట్ జి. శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఐసీసీ, సహేలీ గరల్స్ క్లబ్ ఎగ్జిక్యూటివ్ మెంబర్స్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ బి. హరిప్రసాద్, కో–ఆర్డినేటర్స్ పాల్గొన్నారు.

- కేతనకొండ(ఇబ్రహీంపట్నం): స్థానిక ఎంపీపీ పాఠశాలలో బాలికలతో కేక్ కట్ చేయించి స్వీట్లు పంచారు. ఉర్దూ ఉపాధ్యాయుడు ఇర్ఫాన్‌పాషా మాట్లాడుతూ ఆడపిల్ల పుడితే బాధపడే స్థితి నుంచి ఆడపిల్ల పట్టాలని కోరుకునే స్థితికి సమాజం చేరిందన్నారు. సామాజిక, విద్య, ఆరోగ్య అంశాల్లో బాలికలకు అవగాహన పెంచేందుకు 2008 జనవరి 24 నుంచి బాలికా దినోత్సవం జరుపుకుంటున్నామని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. హెచ్‌ఎం నాగమల్లేశ్వరి, ఉపాధ్యాయులు అనూరాధ, కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.
- నూజివీడు: బాలికలను రక్షించుకోవాల్సిన బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరిపై ఉందని సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అన్నారు. పట్టణంలోని స్నేహా రైడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన వాల్ పోస్టర్‌ను జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. బాలికల హక్కులు కాపాడుతూ వారి అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అవకాశాలు కల్పిస్తే బాలికలు కూడా ఏ రంగంలోనైనా రాణిస్తారన్నారు. బాలికలందరూ బడిలో ఉండేలా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ బసవరాజు నగేష్, విద్యార్థినులు పాల్గొన్నారు.

సీతారామచంద్రస్వామి శోభాయాత్ర



తిరువూరులో సీతారాముల నగరోత్సవం

తిరువూరు: భద్రాచలం సీతారామచంద్రస్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక రథంలో ఉంచి బుధవారం తిరువూరు పట్టణంలో శోభాయాత్ర నిర్వహించారు. శ్రీరామ భక్త బృందం ఆధ్వర్యంలో రాజుపేట నుంచి ప్రధాన వీధుల్లో రామనామ సంకీర్తనతో ఊరేగింపు జరిపారు. భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయ వేదోక్త నిర్వాహకులు, స్థానాచార్యులు కేయీఎస్ సాయి ఆధ్వర్యంలో జరిగిన శోభాయాత్రలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు, విజయవాడ శ్రీదుర్గామల్లేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తల మండలి సభ్యుడు దేవిశెట్టి బాలకృష్ణ, కోదండ రామాలయం, రంగనాయకస్వామి ఆలయం, వేంకటాచలస్వామి దేవాలయాల పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు. గురువారం ఉదయం 9 గంటలకు రాజుపేట శ్రీరస్తు కన్వెన్షన్ హాల్లో సీతారామ కల్యాణం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

జిల్లా స్థాయి పోటీలకు కొండపల్లి బ్యాడ్మింటన్ జట్టు



ఇబ్రహీంపట్నం: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో కొండపల్లి సచివాలయం–5 బ్యాడ్మింటన్ జట్టు జిల్లా స్థాయికి చేరింది. మైలవరం లకిరెడ్డి హనిమిరెడ్డి ఇండోర్ స్టేడియంలో బుధవారం ప్రారంభమైన నియోజకవర్గ స్థాయి పోటీల్లో ఫైనల్ మ్యాచ్‌లో మైలవరం జట్టుపై క్రీడాకారులు సాయితేజ, వాసు అద్భుత విజయం సాధించారు. ప్రభుత్వ ప్రోత్సాహ నగదు రూ.20 వేలు, ట్రోఫీ, సర్టిఫికెట్లు అందుకున్నారు. మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు, ఆర్ఐ రవితేజ, 5వ వార్డు కౌన్సిలర్ మొగిలిదయాసాగర్ క్రీడాకారులను అభినందించారు. జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు.

చిత్తడి నేలలను సంరక్షించాలి



ఆటపాక పక్షుల విడిది కేంద్రాన్ని సందర్శించిన పల్లెర్లమూడి హైస్కూల్ విద్యార్థులు

నూజివీడు: మండలంలోని పల్లెర్లమూడి హైస్కూల్‌కు చెందిన ఏకో క్లబ్ విద్యార్థులు ప్రకృతి సందర్శన కార్యక్రమంలో భాగంగా బుధవారం కైకలూరు మండలంలోని ఆటపాక పక్షుల విడిది కేంద్రాన్ని సందర్శించారు. కేంద్ర అటవీ పర్యావరణ పరిరక్షణ మంత్రిత్వ శాఖ చిత్తడి నేలల సంరక్షణ కార్యక్రమాన్ని ఏడాది పాటు నిర్వహించాలని నిర్ణయించిన నేపథ్యంలో ఏపీ నేషనల్ గ్రీన్‌కోర్, విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో పాఠశాల ఉపాధ్యాయులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో పాల్గొన్న విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. చిత్తడి నేలలు మానవ మనుగడకు ఎంతగానో దోహదపడతాయని, వాటిని కాపాడుకోవాలని ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఏపీఎన్జీసీ ప్రాజెక్టు అధికారి సత్యనారాయణ, నేషనల్ గ్రీన్‌కోర్ జిల్లా సమన్వయకర్త స్వర్ణ వెంకటేశ్వరరావు, క్లస్టర్ కో–ఆర్డినేటర్ మధుసూదనరావు, ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, స్వర్ణ, రాజశ్రీ తదితరులు పాల్గొన్నారు.

హస్తకళల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



వర్క్‌షాప్‌లో వీణను పరిశీలిస్తున్న విజయలక్ష్మి

నూజివీడు: ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సంగీత కళాకారులకు వీణలను అందించిన ఘనత నూజివీడులోని వీణల తయారీదారులకే దక్కుతుందని రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ బి.విజయలక్ష్మి అన్నారు. పట్టణంలోని వీణల తయారీదారుడైన షేక్ మాబూ, హస్తకళాకారులను బుధవారం ఆమె కలిశారు. ఈ సందర్భంగా వారు తయారీ చేసిన వీణలను చూసి అభినందించారు. విజయలక్ష్మి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేతివృత్తులదారులకు అండగా నిలిచి వారి అభ్యున్నతికి దోహదపడుతున్నారన్నారు. చేతివృత్తులకు నేడు ఎంతో డిమాండ్ ఉందన్నారు. మాబూ కుటుంబం మూడు తరాల నుంచి వీణల తయారీలో నిమగ్నమై ఉండటం వారి అదృష్టమని చెప్పారు. చేతివృత్తిదారులందరూ విశ్వకర్మ పథకంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం వీణల తయారీదారులను సన్మానించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎంపీ కేశినేని నాని రాక

విస్సన్నపేట: విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శ్రీనివాసరావు (నాని), వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాస్ గురువారం మండలంలోని కొండపర్వకు విచ్చేస్తారని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు నెక్కళపు కుటుంబరావు బుధవారం తెలిపారు. వారు గురువారం మధ్యాహ్నం 12.30 గంటలకు కొండపర్వ మల్లయ్యస్వామి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని చెప్పారు. అనంతరం భారీ ర్యాలీగా తిరువూరు తరలివెళతారన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

డయల్ యువర్ డీఎంకు విశేష స్పందన



ఇబ్రహీంపట్నం: స్థానిక ఆర్టీసీ డిపో పరిధి బస్సు ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి బుధవారం నిర్వహించిన డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని డిపో మేనేజర్ ఎ.సుబ్రహ్మణ్యం తెలిపారు. తిరువూరు నుంచి హైదరాబాద్ వెళ్లే బస్సు కొండపల్లి ఊరిలో నుంచి తిప్పాలని, విజయవాడ పాత ప్రభుత్వాస్పత్రి వద్ద సిటీ బస్సులు ఆపాలని, కొండపల్లి నుంచి తెల్లవారుజామున బయలుదేరే రూట్ నెంబర్ 1 బస్సు విజయవాడ రైల్వే స్టేషన్ మీదుగా వెళ్లాలని పలువురు విజ్ఞప్తి చేశారని డీఎం తెలిపారు. త్వరలో వీటికి పరిష్కారం చూపుతామన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

ఆగిరిపల్లి: స్థానిక ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు గురువారం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరిగే నాలుగో విడత వైఎస్సార్ ఆసరా పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పల్లగాని నరసింహారావు తెలిపారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

వైభవంగా గ్యార్వీ షరీఫ్ పండుగ



బాబా సమాధి వద్ద చాదర్ సమర్పిస్తున్న అంతర్జాతీయ సూఫీ పీఠాధిపతి హాఫీముద్దీన్ జిలాని

ఏ.కొండూరు: చీమలపాడు ఏఏఎంటీకే దర్బార్ పీఠాధిపతి మహమ్మద్ ఖాజా మొయిద్దీన్ షా తాజ్ ఖాదరి ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి గ్యార్వీ షరీఫ్ పండుగ వైభవంగా జరిగింది. అంతర్జాతీయ సూఫీ పీఠాధిపతి హాఫీముద్దీన్ జిలాని పాల్గొని బాబా దివ్య సమాధి వద్ద చాదర్, పూలు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయన మాట్లాడుతూ చీమలపాడు బాబా సూఫీ మొహమ్మద్ అతావుల్లా షరీఫ్ షాతాజ్ ఖాదరి బాబా అస్తమయం తర్వాత దర్గాను సందర్శించడం ఇదే మొదటిసారి అని అన్నారు. బాబా వారి దీవెనలు ఎప్పుడూ ఉంటాయన్నారు. అనంతరం వేలాది మందికి అన్నసమారాధన జరిగింది. కార్యక్రమంలో దర్బార్ పీఠాధిపతి ఎండీ ఖలీల్‌బాబు, ఎండీ జాఫర్ షరీఫ్, తాజ్ ఖాదర్‌బాబు పాల్గొన్నారు.

వెండి వస్తువులు చోరీ

విస్సన్నపేట: స్థానిక టీచర్స్ కాలనీకి చెందిన ఉపాధ్యాయుడు ఎస్. రామకోటయ్య ఇంటిలో చోరీ జరిగింది. రామకోటయ్య తన కుమారుడిని ఎయిర్‌పోర్ట్‌లో దింపేందుకు మంగళవారం రాత్రి వెళ్లాడు. తిరిగి బుధవారం ఇంటికి వచ్చి చూడగా తలుపులు తీసి ఉండటంతో పాటు బీరువాలో వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలో రూ.30 వేలకు పైగా విలువైన వెండి వస్తువులు చోరీకి గురయ్యారు. ఈ మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సీసీ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన

తిరువూరు: గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో 19వ వార్డులో సీసీ రహదారి నిర్మాణానికి నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి బుధవారం శంకుస్థాపన చేశారు. రూ. 20 లక్షల వ్యయంతో ఈ రహదారి నిర్మాణాన్ని చేపట్టామని వార్డు కౌన్సిలర్ పరసా సత్యనారాయణ తెలిపారు. దీర్ఘకాలంగా ప్రజలు పడుతున్న ఇబ్బందుల పరిష్కారానికి గడప గడపకు మన ప్రభుత్వం నిధులను వినియోగిస్తున్నామని చెప్పారు. మాజీ సర్పంచి పరసా బాబూరావు, వైస్ చైర్‌పర్సన్స్ కోటేశ్వరి, విజయలక్ష్మి, వార్డు కౌన్సిలర్లు మూడు దుర్గారావు, మోదుగు ప్రసాద్, తంగిరాల వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు చలమాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.